క్లుప్తంగా

రేపు అలకాపురంలో 'గడప గడపకు'..

పిట్టలవానిపాలెం: మండలంలోని అలకాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం జరుగుతుందని సర్పంచ్ మంతెన గంగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొంటారని పేర్కొన్నారు.

పెదలంకలో శ్రీ చండీ హోమం



పెదలంక(భట్టిప్రోలు): మండలంలోని పెదలంక గ్రామంలో కొలువైన గంగాపార్వతి సమేత పృథ్వీశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీ చండీ హోమం శాస్త్రయుక్తంగా నిర్వహించారు. ప్రఖ్యా మణికంఠ శర్మ(విజయవాడ)ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హోమంలో గ్రామానికి చెందిన పలువురు దంపతులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం శ్రీ రుద్ర హోమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

రేపల్లె తహసీల్దార్‌గా మల్లికార్జునరావు



రేపల్లె రూరల్: మండల తహసీల్దార్‌గా డి.మల్లికార్జునరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గుంటూరు సీసీఎల్‌లో విధులు నిర్వర్తిస్తూ సాధారణ బదిలీపై రేపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ.. రెవెన్యూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సత్వర సేవలు అందిస్తామన్నారు. ఎవరూ దళారులను ఆశ్రయించ వద్దని, నేరుగా కార్యాలయంలోనే సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు 'ఎ' సర్టిఫికెట్ పరీక్ష



భట్టిప్రోలు: స్థానిక టీఎంరావు హైస్కూల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్స్(బాలికలు)కు మంగళవారం 'ఎ' సర్టిఫికెట్ పరీక్ష నిర్వహించారు. స్థానిక పాఠశాల నుంచి 20 మంది, నగరం మండలం ధూళిపూడి టీబీహెచ్ హైస్కూల్ నుంచి ఇద్దరు ఎన్‌సీసీ క్యాడెట్స్ హాజరయ్యారు. గుంటూరు 10 'ఎ' గర్ల్స్ బెటాలియన్ నిర్వహించిన పరీక్షకు పీఐ స్టాఫ్ విచ్చేశారు. ఎఫ్ఎల్ఓ కేవీఎల్ పార్వతి, హెచ్‌ఎం సి.రామకోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ విశిష్టత, దేశాభివృద్ధికి భావి భారత పౌరుల బాధ్యతను వివరించారు.

విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సురేష్‌బాబు



భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా భట్టిప్రోలుకు చెందిన ఉలవలపూడి సురేష్‌బాబును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రెపాటి ప్రభాకర్ విశ్వకర్మ, ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల శ్రీనివాసరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెసర్లంక ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎంగా వ్యవహరిస్తున్న సురేష్‌బాబు మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ, విశ్వ కర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం పురోభివృద్ధికి తన వంతు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

నేడు వెంకటేశ్వరుని కల్యాణం

పెదపులివర్రు(భట్టిప్రోలు): లోక కల్యాణార్థం మండలంలోని పెదపులివర్రు గుత్తావారిపాలెంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహోత్సవం పురస్కరించుకుని అన్న సంతర్పణ జరుగుతుందని పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

తెనాలిరూరల్: పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. కొందరు పరారవగా, ఇద్దరు పట్టుబడ్డారు. వివరాల మేరకు.. తెనాలి మండలం సంగం జాగర్లమూడి గ్రామ పరిధిలోని నిమ్మ తోటల్లో పేకాట స్థావరంపై రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తన సిబ్బందితో దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. స్థావరం నిర్వాహకుడితో సహా కొందరు పరారయ్యారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.8,150 నగదు స్వాధీనం చేసుకున్నారు. పరారైన వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అవినీతికి తావులేకుండా.. పారదర్శకంగా పాలన

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
- కొత్తపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



కొత్తపాలెంలో వృద్ధురాలితో ఆత్మీయంగా మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి

నిజాంపట్నం: ఎలాంటి అవినీతికి తావులేకుండా.. పారదర్శకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. మండలంలోని కొత్తపాలెంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. అందుకు నిదర్శనం కొత్తపాలెం గ్రామంలో ఒక టీడీపీ నాయకుడికి రూ.6.5 లక్షల క్రాప్ ఇన్సూరెన్స్ వచ్చిందని తెలిపారు. ఇంత లబ్ధి చేకూరినా తమకేమీ ప్రయోజనం జరగలేదని చెప్పడం దారుణమన్నారు. సచివాలయంలో అందుకు సంబంధించిన ఆధారాలున్నాయని, టీడీపీ నాయకుడి ఖాతాలో నగదు జమ అయిన వివరాలు చూపించారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముందుకెళ్తున్న దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు.

లోకేష్‌ది హైటెక్ పాదయాత్ర...

కొత్తపాలెంలో ఎంపీ మోపిదేవి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లోకేష్ పాదయాత్ర హైటెక్ పాదయాత్ర అని విమర్శించారు. 12 రోజుల పాదయాత్రలో 120 కిలో మీటర్లు నడవాల్సి ఉండగా వంద కిలోమీటర్లు కూడా నడవలేని పరిస్థితి నెలకొందన్నారు. చెన్నై నుంచి పెయిడ్ ఆర్టిస్టులను తీసుకొచ్చి కూరగాయల స్టాల్స్ పెట్టించి.. ధరలు ఎలా ఉన్నాయని వారిని లోకేష్ అడగడం, ధరలు మండిపోతున్నాయి, బతకలేకపోతున్నామని పెయిడ్ ఆర్టిస్టులు చెప్పించడం.. పెద్ద డ్రామా అని కొట్టిపడేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఎంతోమందికి ఉద్యోగాలు ఇస్తే..దానిని కాదని లోకేష్ ఎలా చెప్పగలరని ప్రశ్నించారు. సొంత మీడియా ఉందని, దానిని అడ్డం పెట్టుకుని ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని మండిపడ్డారు. 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను మరోసారి సీఎం చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొక్కిలిగడ్డ రవి, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథబాబు, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, ఎంపీటీసీలు గోపాలకృష్ణ, లంకె శ్రీనివాసరావు(ఎల్ఎస్ఆర్), ఎంపీడీఓ నాగలక్ష్మి, తహసీల్దార్ శిరీష పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ పొదుపు పథకాలపై పెరిగిన వడ్డీ రేట్లు

తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు రమేష్



బాపట్ల అర్బన్: పోస్టల్ పొదుపు పథకాలపై కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లను పెంచిందని, ఫలితంగా అధిక వడ్డీ పొందే అవకాశం ఉందని తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు రమేష్ వెల్లడించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. స్థానిక ప్రధాన పోస్టాఫీసులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టైమ్ డిపాజిట్ పథకాలపై ఏడాది కాలపరిమితి గల పొదుపు పథకంలో 5.5 శాతంగా ఉన్న వడ్డీ 6.6 శాతానికి పెరిగిందని చెప్పారు. రెండేళ్లకు 5.7 నుంచి 6.8 శాతానికి, మూడేళ్లకు 5.8 నుంచి 6.9శాతానికి, ఐదేళ్లకు 6.7 నుంచి 7శాతానికి వడ్డీ రేటు పెరిగినట్టు తెలిపారు. సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్‌కు వడ్డీ 7.6 నుంచి 8 శాతానికి పెంచినట్టు చెప్పారు. మంత్లీ ఇన్‌కమ్ స్కీముకు 6.7 నుంచి 7.1 శాతానికి, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌కు వడ్డీని 6.8 నుంచి 7 శాతానికి పెంచినట్టు వివరించారు. కిసాన్ వికాస్ పత్రకు 7 నుంచి 7.2 శాతానికి వడ్డీ పెరిగిందన్నారు. ఖాతాదారులు తమ ఖాతాకు మొబైల్ నంబరును పోస్టాఫీసులో లింక్ చేసుకోవాలని సూచించారు. ఆర్థిక భద్రత కోసం ఖాతా పుస్తకాలను తమ వద్దనే ఉంచుకోవాలని కోరారు. పదేళ్లలోపు ఆడపిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి ఖాతాలను తెరిచేందుకు ఈ నెల 9, 10 తేదీల్లో మెగా మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. పదేళ్లలోపు ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డ్వాక్రా మహిళలకు పెరటికోళ్లు



కోళ్లు అందజేస్తున్న ఎంపీపీ

నగరం: మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం డ్వాక్రా యానిమేటర్లకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి రుణాలు అందించడంతో పాటు, పలు సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. మండలానికి 100 పెరటి కోళ్ల యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.రాధా రమణ, సర్పంచ్ ఇంకోల్లు రామకృష్ణ, ఏపీఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

బాపట్ల అర్బన్ : స్థానిక డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ, ఇంజినీరింగ్ కళాశాలలో టఫే ట్రాక్టర్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు మంగళవారం జరిగాయి. బీటెక్ ఏజీ ఇంజినీరింగ్ చివరి సంవత్సర విద్యార్థులు పి.రాహుల్, జి.మోహన్ రూ.6 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగానికి ఎంపికయ్యారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ విష్ణువర్ధన్, ఆచార్యులు డాక్టర్ కేవీఎస్ రామిరెడ్డి, డాక్టర్ ఎం.మాధవ, డాక్టర్ ఆర్.గణేష్ బాబు, జి.వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో బీసీలకు ప్రాధాన్యం

గడప గడపకు కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున



మహిళలకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కోడితాడి పర్రు(వేమూరు): బీసీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యం కల్పించారని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండలం కోడితాడి పర్రు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు అమలు తీరును ప్రజలను అడిగి మంత్రి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం బీసీలను ఉపయోగించుకోవడం తప్ప వారికి ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. రాజ్యసభలో బీసీలకు ప్రాధాన్యం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, సర్పంచ్ తాడిశెట్టి రమాదేవి, రాష్ట్ర సాహిత్య అకాడమి డైరెక్టర్ ఓలేటి శివాజీ, టి.ఏడుకొండలు, ముద్రబోయిన కృష్ణమూర్తి, మోదుకూరి హరిబాబు, కూచిపూడి సొసైటీ అధ్యక్షుడు సురేష్, నక్కా నాగపార్వతీ, రెడ్డి శ్రీనివాసరావు, నక్కా తిరుపతయ్య చిన్న వెంకటేశ్వర్లు, ముద్రబోయిన చిన శ్రీరాములు, తాడిశెట్టి శివ వెంకటేశ్వర్లు, ముద్రబోయిన రాఘవరావు, తోటకూర పున్నరావు, మోపర్రు సర్పంచ్ కొండపల్లి కిరణ్‌బాబు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు జగనన్న బాటలు

ఎమ్మెల్యే కోన రఘుపతి



నవరత్నాలు పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: రాష్ట్రంలో మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేశారని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండలంలోని జమ్ములపాలెం గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్వాక్రా మహిళలకు విడతల వారీగా రుణ మాఫీ, సున్నా వడ్డీ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు ఏడాదికి రూ.18వేలు, కాపు నేస్తం ద్వారా కాపు మహిళలకు రూ.15వేలు, ఈబీసీ నేస్తం ద్వారా అగ్ర వర్ణాల్లోని పేద మహిళలకు రూ.15వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో ప్రజలకు ఎమ్మెల్యే వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కార మార్గాలు చూపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, వడ్డీముక్కల డేవిడ్, కొక్కిలిగడ్డ చెంచయ్య, ఆట్ల ప్రసాద రెడ్డి, ఎంపీడీవో ఎ.రాధాకృష్ణ, బాపట్ల రూరల్ ఎస్సై వెంకట ప్రసాద్, సచివాలయం సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

భట్టిప్రోలు: వంట గ్యాస్ వినియోగంలో తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాల నుంచి బయట పడవచ్చునని ఇండేన్ గ్యాస్ కంపెని అసిస్టెంట్ మేనేజర్ కె.అశోక్ రాజ్ గోపాల్ పేర్కొన్నారు. భట్టిప్రోలు విశ్వశాంతి హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం ఇండేన్ గ్యాస్ ఆధ్వర్యంలో సేఫ్టీ క్లినిక్‌లో భాగంగా గ్యాస్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో సాయిజ్యోతి గ్యాస్ ఏజెన్సీ డీలర్ వై.సునీల్ కుమార్, గంగడిపాలెం డీలర్ రామకృష్ణ, హైస్కూల్ కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, హెచ్‌ఎం ఫణి పార్థసారథి పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

బాపట్ల అర్బన్: నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. గనిరాజు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రిజర్వేషన్లకు ఎగనామం పెడుతోందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కేవలం 2.5 శాతం నిధులు మాత్రమే కేటాయించారని విమర్శించారు. అనంతరం జేసీ కె.శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ప్రసాద్, జిల్లా కార్యదర్శి పి.ప్రసన్న, నాయకులు హఫీ, సుధ, శేషాద్రి పాల్గొన్నారు.

రమాబాయికి నివాళి

వెల్లటూరు(భట్టిప్రోలు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి జీవితం అందరికి ఆదర్శనీయమని గ్రేస్ ఫౌండేషన్ సభ్యుడు యన్నం సురేష్ పేర్కొన్నారు. మాతా రమాబాయి 125వ జయంతి పురస్కరించుకుని గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెల్లటూరులోని అంబేడ్కర్ విగ్రహానికి, రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఫౌండేషన్ సభ్యులు కె.సుబ్బారావు, పంతగాని నాగేశ్వరరావు, కూరేటి మాణిక్యరావు, దున్నా నారాయణ, అత్తోట ఇస్సాకు, క్రాప నాని, గుండాల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవు



బాపట్లటౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని సెబ్ సీఐ ఎస్.శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని కొండుబోట్లవారిపాలెంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఈపూరి మోహనకృష్ణ అనే వ్యక్తిని మంగళవారం అదుపులోకి తీసుకొన్నారు. అతని నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

చందోలులో ఘనంగా హరిద్ర శృంగార్చన



పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

పిట్టలవానిపాలెం : మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం 45వ హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ ఆలయంలో ప్రతి శుక్రవారం వివాహంకాని మగ పిల్లలకు శ్రీఘ్రంగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

ఆటపాటలతో విద్యా బోధన ఉండాలి



అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న సీడీపీఓ విజయలక్ష్మి

కొల్లూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల మానసిక పరిపక్వత సాధించే దిశగా.. వారికి ఆట పాటలతో కూడిన విద్యాబోధన అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం కొల్లూరులో అమృతలూరు ప్రాజెక్టు పరిధిలోని కొల్లూరు, భట్టిప్రోలు, అమృతలూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రీ స్కూల్ కార్యక్రమాలపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారాన్ని సమయానికి అందజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ నిర్దేశించిన సమయం ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలని స్పష్టం చేశారు. మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రీ స్కూల్ కో–ఆర్డినేటర్ షేక్ సుభాని, సూపర్ వైజర్లు విజయలక్ష్మి, నగరాజ కుమారి, మాధవి, శాంతిశ్రీ, రమణమ్మ, అమృతవాణి, సుజాత పాల్గొన్నారు.

పెరటికోళ్ల పంపిణీ



మహిళలకు పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్

భట్టిప్రోలు: పెరటి కోళ్ల పెంపకంతో మహిళలు మెరుగైన ఆదాయం పొందవచ్చునని భట్టిప్రోలు ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి అన్నారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం 100 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు పెరటి కోళ్లను ఎంపీపీ, జడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ దారా రవి కిరణ్మయి అందజేశారు. జడ్పీటీసీ ఉదయభాస్కరి మాట్లాడుతూ రూ.12 వేల విలువైన కోళ్ల యూనిట్‌ను రూ.4,800లకే ప్రభుత్వం అందజేస్తునట్లు తెలిపారు. కోళ్లకు క్వింటా దాణా, రోగాలు రాకుండా మందులు ఇచ్చినట్లు చెప్పారు. ఏపీఎం కొండూరు శోభన్ మాట్లాడుతూ.. మండలంలో మొత్తం వంద యూనిట్లు అందించడం జరిగిందని..ఒక్కో యూనిట్‌లో 9 పెట్టలు, 3 పుంజులు ఉన్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దారా చెన్నయ్య, దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజి, సీసీలు హనోక్, రజని, మండల సమాఖ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి...

ఊలుపాలెం వ్యక్తి మృతిపై గ్రామస్తుల ఆందోళన



రహదారిపై మృతదేహంతో నిరసన వ్యక్తం చేస్తున్న ఊలుపాలెం గ్రామస్తులు

రేపల్లె రూరల్: అరవపల్లి కాల్వగట్టు సమీపంలో పూరిగుడిసె వద్ద ఊలుపాలెం గ్రామానికి చెందిన రాముల సామియేలు(31) అనే వ్యక్తి సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో రాముల సామియేలుది హత్యేనని, కేసును పూర్తిగా విచారించి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తూ.. నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఎదురుగా రహదారిపై శవాన్ని ఉంచి, బైఠాయించారు. ఆత్మహత్య, అనుమానస్పద మృతి అంటూ పోలీసులు కేసు నమోదు చేసి, మృతుడి కుటుంబానికి అన్యాయం చేయొద్దని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవాలను వెలుగులోకి తెచ్చి.. హత్య చేసిన వారిని శిక్షించాలని కోరారు. పట్టణ సీఐ విజయచంద్ర ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి, మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తానని సర్దిచెప్పారు. అనుమానితులు ఉంటే సమాచారం అందించాలని నచ్చజెప్పి.. నిరసన విరమింపజేశారు.

కబడ్డీలో పట్టు పట్టారు.. అభినందనలు పొందారు



కబడ్డీ జట్టుతో కళాశాల సిబ్బంది

బాపట్ల అర్బన్: విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ కబడ్డీ పోటీల్లో బాపట్ల పాలిటెక్నిక్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం స్థానిక కాలేజీలో క్రీడాకారుల అభినందన సభ జరిగింది. బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాస రావు, సెక్రటరీ మానం నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ డి.రామోహన్‌రావు, ప్రిన్సిపల్ టి.రాజేంద్రప్రసాద్ విద్యార్థులను అభినందించారు. కబడ్డీ జట్టు నుంచి నలుగురు, వాలీబాల్ జట్టు నుంచి ఒకరు సౌత్ జోన్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ఈ సందర్భంగా తెలిపారు. వారికి అన్ని సదుపాయాలను కళాశాల యాజమాన్యం కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్కే నజీర్, ప్రిన్సిపల్ రవికుమార్, అధ్యాపక, అధాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ రాంప్రసాద్ సేవలు ఎనలేనివి



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సత్యనారాయణరాజు

కర్లపాలెం:విశ్రాంత ప్రిన్సిపల్ వై.శ్రీనివాస రాంప్రసాద్ సేవలు ఎనలేనివని శ్రీ రామకృష్ణ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు పేర్కొన్నారు. పెనుమెత్స కోటంరాజు జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం రాంప్రసాద్ సంస్మరణ సభ నిర్వహించారు. సత్యనారాయణరాజు మాట్లాడుతూ.. రాంప్రసాద్ భీమవరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పదవీ విరమణ చేసిన అనంతరం కర్లపాలెంలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాల, పీకేఆర్ జూనియర్ కళాశాలల అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు పెనుమెత్స విజయసారథిరాజు, కార్యదర్శి మంతెన వెంకటశివరామరాజు, ట్రెజరర్ కొమ్మూరి మురళి, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తిమ్మరాజు వెంకట సుబ్బారావు, ఎంవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.విజయ్‌కుమార్, పీకేఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తుమ్మల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు అవగాహన

బాపట్ల అర్బన్ : స్థానిక వీబీ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలతో సమావేశం నిర్వహించారు. మాతా, శిశు ఆరోగ్య సేవలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు. ఆశలకు మొబైల్ అకాడమి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. రక్త హీనతను నివారించడంలో కార్యకర్తలు చేపట్టవలసిన కార్యక్రమాలను వివరించారు. వైద్యాధికారులు డాక్టర్ బి.మౌనిక, డాక్టర్ కె.ఉమాలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ అంజమ్మ పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

తూర్పుపాలెం(భట్టిప్రోలు):అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందించాలని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి కోరారు. పల్లెకోన సెక్టార్ పరిధిలోని ఓలేరు గ్రామం తూర్పుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సూపర్ వైజర్ బేబీ స్వర్ణలత అధ్యక్షతన అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ మేరుగ రంగారావు, ఎంపీటీసీ నీలా సాంబమ్మ, జూనియర్ అసిస్టెంట్ బుస్సా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజి, తదితరులు పాల్గొన్నారు.